క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎంకు వివరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎంను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కోరారు. ఆదివారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్‌ను కలిశారు. కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు, రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శంకర్ తండాను పంచాయతీ చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని శంకర్ తండాను గ్రామ పంచాయతీగా చేయాలని తండా వాసులు కోరారు. హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం బీమ్లా పంచాయతీలో శంకర్, తార్య తండాలు ఉన్నాయని దూరాభారంతో ఇబ్బందులు పడుతున్నామని రెండు తండాలను కలిపి పంచాయతీగా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కృష్ణారావు, ఎంపీటీసీ సత్తిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, విఠల్‌నాయక్, బాలునాయక్, భాస్కర్, దశరథ్, రవి, విజయ్ తదితరులు ఉన్నారు.

కబ్జా చేస్తే కఠిన చర్యలు



అటవీ ప్రాంతంలో నరికివేసిన చెట్లు

హవేళీఘనపూర్: అటవీ ప్రాతంలో చెట్లను నరికినా, భూమిని కబ్జా చేసినా చర్యలు తప్పవని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజ్‌పేట తండాలో అటవీ భూముల్లో గుర్తు తెలియని వ్యక్తులు నరికిన చెట్లను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. చెట్లు కోసే మిషన్లతో దాదాపు నాలుగు ఎకరాల్లో చదును చేసినట్లు గుర్తించారు. చెట్లు నరికిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

మోకాళ్లపై ఉండి నిరసన



శివ్వంపేటలో సమ్మె చేస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద మోకాళ్లపై ఉండి నిరసన తెలిపారు. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ అన్నారు.

స్నేహితుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న వాకర్స్ బృందం

మెదక్ మున్సిపాలిటీ: స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఇందిరాగాంధీ మైదానంలో సన్ రైజ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జీవితంలో అత్యంత విలువైనది స్నేహం అని, ఫ్రెండ్ షిప్‌డే జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

డంప్‌యార్డుకు చేరని చెత్త



రైల్వేలైన్ బ్రిడ్జి సమీపంలో రోడ్డుపై పడేసిన చెత్త

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో చెత్త నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా మారింది. ప్రతీరోజు ఇంటింటా సేకరించిన చెత్తను పట్టణ శివారులోని డంప్‌యార్డుకు తరలించాల్సి ఉండగా, సానిటేషన్ అధికారుల పర్యవేక్షణ లోపంతో రోడ్డు పక్కన పడేస్తున్నారు. డంప్‌యార్డు దారిలో రైల్వే బ్రిడ్జి సమీపంలో చెత్తను పడేయడంతో రోడ్డు అంతా డంప్‌యార్డు తయారై దుర్గంధం వెదజల్లుతోంది.



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

స్వచ్ఛతపై పట్టింపేది?

ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

వెల్దుర్తి(తూప్రాన్): స్వచ్ఛ, ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛత కార్యక్రమాలు విరివిగా చేపడుతుంది. పల్లె, పట్టణ ప్రగతి, స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేస్తుంది. ప్రతీ పల్లెలో స్వచ్ఛత కార్యక్రమాలు అనునిత్యం పర్యవేక్షించే బాధ్యత మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఉంటుంది. పల్లెల్లో పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నా పర్యవేక్షించే అధికారుల కార్యాలయం మాత్రం మొత్తం పిచ్చిమొక్కలు, చెత్తా చెదారంతో డంప్‌యార్డ్ తలపిస్తుంది. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మూడువైపులా గడ్డి, ఇతర పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగినా అనునిత్యం కార్యాలయంలోనే విధులు నిర్వర్తించే అధికారులు అటువైపు చూడకపోవడం గమనార్హం. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం పరిస్థితే ఇంత అధ్వానంగా ఉంటే గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందోనని వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు వాపోతున్నారు. స్వచ్ఛతపై సంబంధిత అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో కార్యాలయం పరిసరాలు చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గద్దర్ మృతి తీరని లోటు



కొవ్వొత్తుల సంతాపం తెలుపుతున్న నాయకులు



కొడిపల్లిలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం సభ్యులు

మెదక్/మెదక్ మున్సిపాలిటీ: ప్రజాయుద్ధనౌక గద్దర్ మృతి తీరని లోటని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు ఉమర్, నాయకులు గూడూరి అరవింద్‌గౌడ్, మోచి కిషన్, జగదీష్,జుబేర్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): గద్దర్ మృతిపై తెలంగాణ రచయిత వేదిక మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేశరాజు రమేష్‌బాబు, తొడబోయిన తిరుపతి సంతాపం తెలిపారు.

అధికారికంగా నిర్వహించాలి

వెల్దుర్తి(తూప్రాన్): తన ఆట, పాటలతో ప్రజలను చైతన్య పరిచిన గద్దర్ అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి కోరారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెం గ్రామంలో యువకులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

నర్సాపూర్‌రూరల్: హోళియదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, దళితరత్న అవార్డు గ్రహీత శాఖమూరి యాదగిరి సంతాపం వ్యక్తం చేశారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లిలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఏసు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల సందడి నెలకొంది. దొంతి, రత్నపూర్ గ్రామాల్లో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పూజలు చేసి బోనాలు సమర్పించారు. అనంతరం రాత్రి తొట్టెల ఊరేగింపు చేపట్టారు.

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ముత్యాలమ్మ, మహంకాలమ్మ, నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, కనకదుర్గా మాతాకు గ్రామదేవతలకు బోనాలు నిర్వహించారు. సర్పంచ్ మన్నే మహాదేవి నవీన్, ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, ఉప సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

హాజరైన సునీతారెడ్డి



వెల్దుర్తి(తూప్రాన్): పాల్గొన్న సునితారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో ఆదివారం నిర్వహించిన మహంకాళి జాతర ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన బోనాలు ఊరేగింపునకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితారెడ్డి హాజరై పూజలు చేశారు. ఆమెతో సర్పంచ్ మదుసూధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు గౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి

మెదక్ మున్సిపాలిటీ: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్, నాయకులు జుబేర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సార్ ఆశయాలను కొనసాగిస్తాం

మెదక్: జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిస్తామని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్‌తో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా ఉపాధ్యక్షులు మంగ మనోహర్, ఎండీ ఫజలుద్దీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఆధ్వర్యంలో..

నర్సాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

కార్యక్రమంలో సంఘం నాయకులు కృపాచారి, నరేందర్‌చారి, దశరథచారి తదితరులు ఉన్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని చౌరస్తాలో జయశంకర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, జాగృతి జిల్లా అధ్యక్షురాలు మల్లిక, ప్రధాన కార్యదర్శి అవినాష్, మాజీ ఎంపీటీసీ కమ్మరి సిద్దయ్య, నాయకులు భాస్కర్, శ్రీధర్‌రెడ్డి, మహేందర్, సత్యం, వసీం, సురేష్, శ్రీనివాస్, వసంత్, బాబా,



టేక్మాల్ చౌరస్తాలో...

మహేందర్, వెంకట్, వసంత్, సాయిలు, నాగరాజు, సత్యనారాయణ, ప్రభాకర్, నారాగౌడ్, కొండీశు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి జెడ్పీ నిధులు



వివరాలు వెల్లడిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల అభివృద్ధికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ పట్లోరి మాధవి జెడ్పీ నిధుల నుంచి రూ.20.40 లక్షలు మంజూరు చేసినట్లు మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మంచాల లక్ష్మణ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి తెలిపారు. జెడ్పీ పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం రూ.3.90 లక్షలు, గవ్వలపల్లి, చెన్నాయిపల్లి, చందాపూర్‌లో డ్రైనేజీలు, రుద్రారం గ్రామ పెద్దమ్మ ఆలయం వద్ద, సంగాయిపల్లిలో బోరు మోటారు ఏర్పాటుకు, అగ్రహారంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రం, బీఆర్‌ఎస్ మండల నాయకులు పడాల శ్రీనివాస్, తోట రమేష్, శివులు, బండారు నెల్లూర్ ఉన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



తునికి నల్లపోచమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

నర్సాపూర్: అధిక శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు శ్రీకన్యకాపరమేశ్వరీ మాతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పూజలు చేసి అధిక వాయనం సమర్పించారు.

ఆర్టీసీ కార్మికుల సంబురాలు

మెదక్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై ఆదివారం గవర్నర్ ఆమోదం, అసెంబ్లీలో బిల్లు పాస్ కావడంపై మెదక్‌లో కార్మికులు టపాసులు కాల్చి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఆర్‌కె రావు, పీఎస్ రెడ్డి, శేఖర్, నారాయణ, నర్సింలు పాల్గొన్నారు.



డిపో ఎదుట సంబురాలు చేసుకుంటున్న ఆర్టీసీ కార్మికులు

రామలింగారెడ్డి జీవితం ఆదర్శం

రామాయంపేట(మెదక్): ప్రజా సంక్షేమం కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి సోలిపేట రామలింగారెడ్డి అని ఆయన కుమారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సతీశ్‌రెడ్డి అన్నారు. రామలింగారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం సతీశ్ మాట్లాడుతూ.. ప్రజల కోసం పోలీస్ నిర్బంధాలను సైతం ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. రామలింగారెడ్డి సతీమణి సుజాత మాట్లాడుతూ.. ఎంత కష్టం వచ్చినా వెరవకుండా ముందుకు సాగారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎంపీపీ చిందం సబిత, ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జెడ్పీటీసీ కృష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకుడు మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బాబు, సహకార సంఘం చైర్మన్ శంకర్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు సుజాత, నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యం, సర్పంచ్ చత్రియ తదితరులు పాల్గొన్నారు.



రామలింగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

క్రైస్తవుల భారీ ర్యాలీ

మెదక్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలు, చర్చిలపైన జరిగిన ఘటనలకు సంఘీభావంగా ఆదివారం సాయంత్రం మెదక్ పట్టణంలో క్రైస్తవులు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. మెదక్ చర్చి నుంచి బస్టాండ్, పోస్టాఫీస్, పోలీస్ స్టేషన్, చిల్డ్రన్ పార్క్, రాందాస్ చౌరస్తా, చమన్, బాలాజీ మఠం, ఫారెస్ట్ కార్యాలయం, ఫతేనగర్ మీదుగా ర్యాలీ సాగింది. వేలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా ఐక్య క్రైస్తవ సంఘాలు, సీఎస్ఐ, ఇండిపెండెంట్ చర్చిలు, సార్వత్రిక క్రైస్తవ సంఘం యూనివర్సల్ చర్చి పాస్టర్స్ అసోసియేషన్ సారథ్యంలో ర్యాలీ కొనసాగింది.



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని కొంతన్‌పల్లి ఉన్నత పాఠశాల 1995–96 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. 27 సంవత్సరాల అనంతరం కలుసుకున్న విద్యార్థులు గురువులను సన్మానించారు. స్నేహితుల యోగక్షేమాలు, తదితర విషయాలు చర్చించుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు**

నర్సాపూర్: బీఆర్‌ఎస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయనందుకే ప్రజలు బీఆర్‌ఎస్‌ను వ్యతిరేకిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని అన్నారు. అనంతరం గద్దర్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

◆ **పరామర్శ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సదాశివపల్లి పంచాయతీ పరిధి పాంపల్లి గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ రాయగిరి తండ్రి గాదె సత్తయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమెతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, సర్పంచ్‌లు శోభ, అంజమ్మ, ఎల్లం, మాజీ సర్పంచ్ వీరయ్య, నాయకులు ఉన్నారు.

◆ **జీపీ ఏర్పాటుపై సంబరాలు**

రామాయంపేట(మెదక్): మండలంలోని దంతేపల్లి తండాను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయడంపై గిరిజనులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. సేవాలాల్ తండా, బిక్షపతి తండా, రాంచందర్ తండా, బిల్యా తండా, సుభాశ్ తండాలకు చెందిన గిరిజనులు సీఎం కేసీఆర్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దంతేపల్లి, కిషన్ తండా, కాట్రియాల సర్పంచులు సురేశ్ నాయక్, సుభాశ్ నాయక్, శ్యాం, నాయకులు రాజేందర్, స్వామి, పాండు నాయక్, దేవెందర్, బన్సీలాల్, అమ్రియా నాయక్, రామచందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

◆ **రుణమాఫీపై హర్షం**

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంపై ఆదివారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో సర్పంచ్ గోదావరి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

◆ **ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి**

కొల్చారం(నర్సాపూర్): నిరుద్యోగ యువత ఎంచుకున్న రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని, ఆర్థికంగా రాణించాలని ఎంపీపీ మంజుల అన్నారు. ఆదివారం మండలంలోని రంగంపేటలో కోనాపూర్ గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డయగ్నోస్టిక్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, సర్పంచ్‌లు సుజాత, రమేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, సంతోష్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థికసాయం**

తూప్రాన్: ఇటీవల మృతిచెందిన శివ్వంపేట మండలం పోతులబొగుడకు చెందిన సుంచనకోట గణేష్ గౌడ్ కుటుంబానికి పలువురు ఆర్థికసాయం చేశారు. తూప్రాన్ డివిజన్ ఆర్టిస్టు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, అధ్యక్షుడు ధరిపల్లి భిక్షపతి, అసోసియేషన్ సభ్యులు కలిసి రూ.20వేలను సాయంగా అందజేశారు.

◆ **రెండు లక్షలు ఇవ్వాలి**

నర్సాపూర్: రుణమాఫీ పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాలయాపన చేశారని, ఎన్నికలు వస్తున్నందున రుణమాఫీ చేస్తామంటూ ప్రకటించడం సరికాదన్నారు. ఆలస్యం కావడంతో వడ్డీ పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

◆ **అంత్యక్రియలకు సాయం**

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని న్యూ మార్కెట్‌లో మృతిచెందిన శశిధర్ అంత్యక్రియలకు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆర్థికసాయం చేశారు. కౌన్సిలర్ బొద్దుల రుక్మిణి సహకారంతో రూ.10 వేలను మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

◆ **బోరు డ్రిల్లింగ్**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బోరు డ్రిల్లింగ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌గౌడ్, లింగంరాజ్, సత్తయ్య, వెంకటయ్య, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

◆ **పాస్టర్‌గా జైపాల్**

కౌడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లి సీఎస్ఐ చర్చి నూతన పాస్టర్‌గా రెవ. జి.జైపాల్ నియామకమయ్యారు. ఇక్కడ పాస్టర్‌గా ఉన్న రెవ. బి.రమేష్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆదివారం బాధ్యతలు చేపట్టి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి బైబిల్ సందేశం ఇచ్చారు. అనంతరం చర్చి సభ్యులు జ్ఞానప్రకాష్, ఏసు, శ్రీనివాస్, భూషణం, రవి, నిర్మల, జ్యోతి, విమల, జైల్, రాజు తదితరులు ఆయను సన్మానించారు.

◆ **సీఆర్పీ కార్యవర్గం ఎన్నిక**

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లా కేంద్రం మెదక్‌లో ఆదివారం సీఆర్పీల నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు పేర్కొన్నారు. కార్యవర్గంలో చోటు కల్పించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఆర్పీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

◆ **చాముండేశ్వరీకి పూజలు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరీ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు ప్రభాకరశర్మ తెలిపారు. కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు.

◆ **బీసీల హక్కుల పరిరక్షణే లక్ష్యం**

గజ్వేల్: హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకుసాగుతామని గజ్వేల్ బీసీ ఐక్య వేదిక నాయకులు ప్రకటించారు. ఆదివారం గజ్వేల్‌లోని టీవైఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సభలో ఐక్య వేదిక నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కామల్ల అయిలయ్య, సింగం సత్తయ్య, దుర్గాప్రసాద్, రామచంద్రం, రాజేశం, నర్సింగరావు, రేగొండ తదితరులు మాట్లాడారు. గజ్వేల్‌లో త్వరలో ప్రొఫెసర్ జయశంకర్, జ్యోతిరావుపూలే విగ్రహాలతోపాటు 1969 తెలంగాణ ఉద్యమంలో అసువుల బాసిన అయిల నర్సింలు విగ్రహాల ఏర్పాటుకు తీర్మానం చేశారు.

◆ **గద్దర్ మృతితో విషాదం**

శివ్వంపేట(నర్సాపూర్): గద్దర్ మరణంతో శివ్వంపేట మండల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను ఉత్తేజపరిచారు. గూడూర్ వాసి, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గద్దర్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దొంతికి చెందిన కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతరావు 8 ఏళ్ల క్రితం గొలుసు కట్టు చెరువుల ప్రాముఖ్యతపై గద్దర్‌తో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఆయన చెప్పిన మాటలు మండల ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేరు. ఆయన మృతిపై బీఆర్‌ఎస్ నాయకుడు పబ్బ రమేష్‌గుప్తా, నారాయణరావు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

◆ **స్నేహితుల చేయూత**

శివ్వంపేట(నర్సాపూర్) ఆర్థిక ఇబ్బందుల్లో స్నేహితురాలి కుటుంబానికి మిత్రులు చేయూతనందించారు. శివ్వంపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన స్నేహితురాలు భర్త అనారోగ్యంతో మృతి చెందగా మిత్రులు రూ.38వేలు అందజేశారు. భాస్కర్‌గుప్తా, వేణుమాధవ్, శోభన్‌గౌడ్, రాజు శ్రీనివాస్‌గౌడ్, నీలిమ,వాణి, జానకి ఉన్నారు.